ఆంధ్రప్రభ సోమవారం 7-7-2025

# నేడు టీజీ ఐసెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ ఐసెట్- 2025 ఫలితాలను సోమవారం విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి ఫలితాలను విడుదల చేస్తారని కన్వీనర్ అలువాల రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 8, 9 తేదీలో ఐసెట్ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫలితాలు విడుదలతో పాటు, ర్యాంకు కార్డులను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

నవతెలంగాణ సోమవారం 7 జులై 2025

# 171 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1,07,218 సీట్లు



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో 171 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1,07,218 సీట్లను టీజీ ఈఏపీ సెట్ కన్వీనర్ ఏ.దేవసేన ప్రకటించారు.

| క్రసంఖ్య | అఫిలియేటింగ్ యూనివర్సిటీ | యూనివర్సిటీ అఫిలియేషన్ కాలేజీల సంఖ్య | యూనివర్సిటీ అఫిలియేషన్ ఇన్‌టేక్ | ఇంజినీరింగ్ కెటగిరీ కన్వీనర్ కోటా కాలేజీల సంఖ్య | ఇంజినీరింగ్ కెటగిరీ కన్వీనర్ కోటా ఇన్‌టేక్ |
|---|---|---|---|---|---|
| 1. | ఓయూ | 14 | 10230 | 14 | 7161 |
| 2. | జేఎన్‌టీయూహెచ్ | 130 | 87804 | 130 | 61463 |
| 3. | కేయూ | 04 | 1576 | 04 | 1103 |
| మొత్తం | | 148 | 99610 | 148 | 69727 |
| యూనివర్సిటీ,కన్సల్టెంట్ కాలేజీలు - ప్రయివేట్ యూనివర్సిటీ | | -- | 7608 | 23 | 7068 |
| మొత్తం | | | 107218 | 171 | 76795 |

మన తెలంగాణ
సోమవారం 7, జులై 2025

# కన్వీనర్ కోటాలో 76,795 సీట్లు

**• కొనసాగుతున్న ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ • మూడు కొత్త యూనివర్సిటీ కాలేజీల్లో 720 సీట్లు అందుబాటులోకి**



మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో 171 ఇంజినీరింగ్ కాలేజీల్లో మొత్తం 1,07,218 సీట్లు కన్వీనర్ కోటాలో 76,795 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయని సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది. ఈసారి మూడు కొత్త యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో అదనపు సీట్లు అందుబాటులోకి వచ్చాయి. పాలమూరు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో కొత్తగా 180 సీట్లు అందుబాటులోకి రాగా, శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 240 సీట్లు, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ తెలంగాణ కాలేజీలో 300 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం 21 యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో 5808 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 9 జెఎన్‌టియుహెచ్ కాలేజీల్లో 3210 సీట్లు అందుబాటులో ఉండగా, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని రెండు కాలేజీల్లో 630 సీట్లు, 2 కెయు ఇంజనీరింగ్ కాలేజీల్లో 780 సీట్లు, ఒక మహాత్మాగాంధీ వర్సిటీ కాలేజీలో 240 సీట్లు, ఒక జెఎన్‌ఎఫ్ఎయు కాలేజీలో 160,2 ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలేజీలో 45, పివి నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన ఒక కాలేజీలో 23 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 23 యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేట్ యూనివర్సిటీలలో 7608 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయని సాంకేతిక విద్యాశాఖ తెలిపింది. రెండు ప్రైవేటు వర్సిటీల్లో 1800 సీట్లు అందుబాటులో ఉండగా, కన్వీనర్ కోటా కింద 1260 సీట్లు ఉన్నాయని వెల్లడించింది.

### అత్యధిక సీట్లు సిఎస్ఇలోనే

బి.టెక్ కోర్సులలో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సిఎస్ఇ)లో 26,150 సీట్లు అందుబాటులో ఉండగా, సిఎస్ఇ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్)లో 12,495 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్(ఇసిఇ)లో 10,125 సీట్లు ఉన్నట్లు సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది. అలాగే సిఎస్ఇ(డాటా సైన్స్)లో 6996 సీట్లు, సిఎస్ఇ(సైబర్ సెక్యూరిటీ)లో 1439 సీట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డాటా సైన్స్‌లో 1235 సీట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌లో 858 సీట్లు, సిఎస్ఇ(సైబర్ సెక్యూరిటీ ఇంక్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ)లో 168 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది.

### సివిల్‌లో 3129, మెకానికల్‌లో 2994 సీట్లు

ఇంజనీరింగ్ సీట్లలో ఈ విద్యాసంవత్సరం సంప్రదాయ బ్రాంచీలైన సివిల్ ఇంజనీరింగ్‌లో 3129 సీట్లు అందుబాటులో ఉండగా, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2994 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 3681, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 4301 సీట్లు అందుబాటులో ఉన్నట్లు సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది.

### జెఎన్‌టియుహెచ్‌లో 3210

రాష్ట్రంలో 21 వర్సిటీ కాలేజీల్లో 5808 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో అత్యధికంగా జెఎన్‌టియుహెచ్‌లోని తొమ్మిది కాలేజీల్లో 3210 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీలోని మూడు కాలేజీల్లో 780 సీట్లు అందుబాటులో ఉండగా, ఉస్మానియా యూనివర్సిటీలోని రెండు కాలేజీల్లో 630 సీట్లు, మహాత్మాగాంధీ వర్సిటీలోని ఒక కాలేజీలో 240, జెఎన్‌ఎఫ్ఎయులోని ఒక కాలేజీలో 160 అందుబాటులో ఉన్నట్లు సాంకేతిక విద్యాశాఖ తెలిపింది. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రెండు కాలేజీల్లో 45 సీట్లు, పి.వి.నరసింహారావు ఉద్యానవన వర్సిటీలోని ఒక కాలేజీలో 23 సీట్లు ఉన్నాయి.

## ఆలస్యంగా మొదలైన వెబ్ ఆప్షన్ల నమోదు

రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించే ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. కౌన్సెలింగ్‌లో కీలకమైన వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఆదివారం ఉదయం ప్రారంభం కావాల్సి ఉండగా, సీట్లపై స్పష్టత రాకపోవడంతో సాయంత్రం 4 గంటలకు మార్పు చేశారు. అప్పటికీ వెబ్ ఆప్షన్ల నమోదు అందుబాటులోకి రాకపోవడంతో మరోసారి నమోదు ప్రక్రియను మార్పు చేసి, చివరగా, సాయంత్రం 6 గంటల తర్వాత నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో వెబ్ ఆప్షన్ల నమోదు కోసం ఉదయం నుంచి వెబ్‌సైట్ ముందు కూర్చున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు షెడ్యూల్ ప్రకారమే వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందా... లేక వాయిదా పడుతుందా? అన్న సందేహాలు వ్యక్తం చేస్తూ నిరుత్సాహానికి గురయ్యారు. చిరవగా ఆదివారం రాత్రి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆప్షన్ల ఎంపికపై విద్యార్థులు కసరత్తు మొదలుపెట్టారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 10 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 18వ తేదీన మొదటి విడత సీట్లు కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జులై 18 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.

వార్త, హైదరాబాద్, సోమవారం 7, జూలై 2025

# ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్

## దరఖాస్తు గడువు నేడు పూర్తి

### 96,802 మంది దరఖాస్తు.. మొదలైన వెబ్‌ఆప్షన్లు

### 70,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్..

### 13న మాక్ సీట్ కేటాయింపు

**హైదరాబాద్, జూలై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా స్లాట్‌బుక్ చేసుకునే గడువు నేటి(సోమవారం)తో ముగియనుంది. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొన సాగిస్తుండగా.. ఆదివారం రాత్రి నుంచి వెబ్ ఆప్షన్లను ప్రారంభమయ్యాయి. జూన్ 28 నుంచే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 96,802 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 70, 561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. నేటి(జులై 7)తో విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి గడువు ముగియనుండగా.. రేపటి(జులై8) వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనుంది. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగనుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 13న మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదీల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఈనెల 25న వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 30లోపు రెండోవిడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలి.

### రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు

# లక్షపైనే..

### కన్వీనర్ కోటాలో 76,795 సీట్లు

### 148 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు




**హైదరాబాద్, జులై 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో 1,07,218 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం అనుమతించిన కాలేజీల్లోని ఇంజనీరింగ్ సీట్లు ఇవి. గత ఏడాది కొన్ని కాలేజీలు అదనపు సీట్ల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా వాటికి అనుమతి లభించలేదు. మొదటి విడత ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ నాటికి రాష్ట్రంలో 1,07,218 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 76,795 సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 4 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు తగ్గాయి. గత ఏడాది 152 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా..ఈ ఏడాది 148 కాలేజీలకు గుర్తింపును ఇచ్చింది. ఈ ఏడాది కొత్తగా రెండు యూనివర్సిటీ కాలేజీలు ఒక ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ అందుబాటులోకి వచ్చాయి. వాటిలో పాలమూరు యూనివర్సిటీలో 180 సీట్లు, శాతవాహన యూనివర్సిటీలో 240 సీట్లు, ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో 300 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఇంజనీరింగ్‌లో మొదటి విడత కౌన్సెలింగ్ నాటికి 70, 307 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. అదికాస్త ఈ ఏడాది 76,795 సీట్లు అందుబాటులో ఉండనున్నట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 148 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపును ఇచ్చారు. వాటిలో 99,610 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవికాకుండా ప్రభుత్వ, యూనివర్సిటీ, యూనివర్సిటీ కాన్‌స్టిట్యూయెంట్ కాలేజీలు 23 ఉండగా..వాటిలో 7068 సీట్లు అందుబాటులో >>2

## సీట్లు లక్షపైనే..

>>ఉంటాయి. రాష్ట్రంలో 2 ప్రైవేటు వర్సిటీల్లో 1260 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా రాష్ట్రంలో 171 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కలిపి 1,07,218 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 76,795 సీట్లు కన్వీనర్ కోటాలో సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**బ్రాంచ్‌ల వారీగా సీట్లను పరిశీలిస్తే..**

రాష్ట్రంలో ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో అన్ని బ్రాంచ్‌ల్లో కలిపి కన్వీనర్ కోటాలో 76,795సీట్లు అందుబాటులో ఉన్నట్టు ఈఏపీ సెట్-2025కౌన్సెలింగ్ అధికారులు ప్రకటించారు. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో 26,150 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డాటాసైన్స్‌లో 1235 సీట్లు, సివిల్ ఇంజనీరింగ్‌లో 3129 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(డాటాసైన్స్)లో 6996 సీట్లు, సీఎస్ఈ(సైబర్ సెక్యూరిటీ)లో 1439 సీట్లు, సీఎస్ఎం(ఏఐఎంఎల్)లో 12,495 సీట్లు, ఈసీఈలో 10,125 సీట్లు, ఈఈఈలో 4301 సీట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)లో 3681 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2994 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

హైదరాబాద్ • సోమవారం 7 జూలై 2025

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

# 171 ఇంజనీరింగ్ కాలేజీల్లో 1,07,218 సీట్లు

- **కన్వీనర్ కోటాలో 76,795 సీట్ల భర్తీ**
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రేపే ఆఖరు**

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 171 ఇంజనీరింగ్ కాలేజీల పరిధిలో 1,07,218 సీట్లను భర్తీ చేయనున్నట్టు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. వీటిలో కన్వీనర్ కోటా కింద 76,795 సీట్లను భర్తీ చేయనున్నట్టు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు యూనివర్సిటీల వారీగా కాలేజీల్లో భర్తీ చేసే సీట్ల వివరాలతో పాటు ఏయే కోర్సుల్లో ఎన్ని సీట్లున్నాయన్న వివరాలతో జాబితాను విడుదల చేసింది. కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 95,654 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని, ఇప్పటివరకు 76,494 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనట్టు తెలిపారు. కాగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జూలై 8 ఆఖరు తేదీగా ప్రకటించారు. ఇక ఆప్షన్ల కోసం జూలై 6 నుంచి 10వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన వెల్లడించారు. కాగా 10 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిధిలోని 21 కళాశాలల్లో 5,808 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు. వీటిలో ఈ ఏడాది కొత్తగా పాలమూరు (180), శాతవాహన (240), ఎర్త్‌సైన్స్ (300) యూనివర్సిటీల పరిధిలో కలిపి 720 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల పరిధిలోని 2 కాలేజీల్లో 1,800 సీట్లుండగా.. వాటిలో 1,260 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు.

**సీఎస్ఈలో 26,150 సీట్లు...**

రాష్ట్రంలోని ఓయూ, జేఎన్‌టీయూహెచ్, కేయూ పరిధిలో మొత్తం 171 కాలేజీలుండగా.. ఓయూ పరిధిలో 14, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 130, కేయూ పరిధిలో 4, ప్రైవేటు యూనివర్సిటీల పరిధిలో 23 కాలేజీలున్నాయి. వీటన్నింటిలో కలిపి 1,07,218 సీట్లుండగా.. 76,795 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. అన్ని కాలేజీల్లో కలిపి 47 బ్రాంచీలున్నాయి. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) 26,150 సీట్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్)లో 12,495, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 10,125, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్)లో 6,996, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 4,301, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 3,681, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2,994, సివిల్ ఇంజనీరింగ్‌లో 3,129, ఆర్టిఫిషియల్ అండ్ డేటా సైన్స్‌లో



1,235, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీస్) 1,439 సీట్లుండగా.. మిగిలిన అన్ని బ్రాంచీల్లో ఒక్కో దానిలో వెయ్యిలోపే సీట్లున్నాయి. అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్ (ఎంఎంఎస్), బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ థర్మల్ ఇంజనీరింగ్ (ఎంటీఈ) బ్రాంచీల్లో ఒక్కోదానిలో అతి తక్కువగా 30 చొప్పున సీట్లున్నాయి. డెయిరీంగ్ బ్రాంచీలో 23 సీట్లుండగా ఎలక్ట్రానిక్స్అండ్‌టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అతి తక్కువగా 21 సీట్లే ఉన్నాయి.

సాక్షి
సోమవారం । 7 । జూలై । 2025

# కొలిక్కిరాని పాలిసెట్



## కొనసాగుతున్న డేటా రికవరీ ప్రయత్నాలు

**రికవరీ అయినా స్క్రీన్‌పై మాయమవుతున్న డేటా**
**ఒక్కసారిగా అటాక్ చేసిన బగ్స్**
**పెన్ డ్రైవ్ పెట్టారా? డేటాను బదిలీ చేశారా?**
**సమాచార సేకరణలో నిఘా వర్గాలు**
**రంగంలోకి ఐటీ నిపుణులు..**
**మరో వారం దాకా సీట్ల కేటాయింపు కష్టమే**

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్ గందరగోళం ఇంకా కొనసాగుతోంది. వెబ్‌సైట్ నుంచి తుడిచిపెట్టుకుపోయిన డేటాను రికవరీ చేసేందుకు సాంకేతిక విద్యా విభాగం అష్టకష్టాలు పడుతోంది. ఏం జరుగుతోందనేది మాత్రం బయటకు పొక్కనివ్వడం లేదు. సీట్ల కేటాయింపు ఇప్పట్లో ఉండే అవకాశం లేదని అధికారులు పరోక్షంగా చెబుతున్నారు. వచ్చేవారం దీనిపై స్పష్టత రావచ్చని సంకేతాలిస్తున్నారు. ఈ గందరగోళంపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకునేందుకు ఆదివారం కొంతమంది విద్యార్థులు పాలిసెట్ క్యాంపు కార్యాలయానికి వెళ్లే ప్రయత్నం చేశారు. అనుమతి లేకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. మరోవైపు ముఖ్యమంత్రి కార్యాలయం మిగతా 16వ పేజీలో ▶

**ఎట్టకేలకు ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు మోక్షం**

- సీట్లు, కాలేజీలు, బ్రాంచీల వివరాలు విడుదల
- కన్వీనర్ కోటా సీట్లు 76,795.. కొత్త సీట్లకు నో
- కౌన్సెలింగ్ పరిధిలోకి 171 కాలేజీలు

16 లో

# కొలిక్కిరాని పాలిసెట్

▶ మొదటి పేజీ తరువాయి

దీనిపై వివరాలు సేకరిస్తోంది. నిఘా వర్గాలు కూడా అసలేం జరిగిందని వాకబు చేస్తున్నాయి. పాలిసెట్ తొలి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 4వ తేదీన చేపట్టాల్సి ఉంది. ఈలోగా పాలిసెట్ వెబ్ ఆప్షన్ల డేటా మొత్తం ఎరైజ్ అయిన విషయం బయటకు పొక్కింది. దాదాపు 22 వేల మంది విద్యార్థులు పాలిటెక్నిక్ సీట్ల కోసం ఎదురుచూస్తున్నారు.

**పదేపదే ఎర్రర్స్**

డేటా రికవరీ కోసం సాంకేతిక విద్యా విభాగం శనివారం రాత్రి నుంచి పరుగులు పెడుతోంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే ఉద్యోగులను కొన్నాళ్లు ఆఫీసుకు రావద్దని ఆదేశించారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం ప్రత్యేక సాంకేతిక బృందాలను రంగంలోకి దించి సాఫ్ట్‌వేర్ పొరపాట్లను గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. డేటాను బ్యాకప్ ద్వారా రికవరీ చేసినప్పటికీ, ఆప్షన్ల విషయంలో సెకన్లలోనే డేటా స్క్రీన్ మీది నుంచి మాయమవుతున్నట్లు తెలిసింది. ప్రాథమిక హార్డ్ డిస్క్‌ల్లో కొన్ని రకాల బగ్స్ ఏర్పడినట్టు తెలిసింది. క్యాంపు కార్యాలయంలోని కంప్యూటర్స్‌లో ఎవరైనా వైరస్ ఉన్న పెన్ డ్రైవ్‌లు వాడితే ఇలాంటి బగ్స్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. లేదా ఆప్షన్ల డేటాను నెట్‌వర్క్ ద్వారా ఇతరులు తమ ఆధీనంలోకి తీసుకున్నా సమస్య రావచ్చని తెలిపారు. ఇలా చేయగలిగే అవకావం కేవలం క్యాంపు కార్యాలయంలోని సిబ్బందికే ఉంటుందని చెబుతున్నారు. ఇది ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఆప్షన్లు తారుమారు చేసే ప్రయత్నాలు జరిగాయా? అనే సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

**రంగంలోకి నిఘా వర్గాలు**

ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన డేటా రాత్రికి రాత్రే తుడిచి పెట్టుకుపోవడంతో ప్రభుత్వ వర్గాలు షాక్‌కు గురయ్యాయి. దీనిపై ప్రభుత్వం నిఘా వర్గాల సమాచారం కోరినట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ వర్గాలు రాత్రి నుంచి సాంకేతిక విద్య వర్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నాయి. ప్రాథమిక సమాచారాన్ని ఆదివారం ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. మరోవైపు సీట్ల కేటాయింపు ఆలస్యం కావడంపై విద్యార్థుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంటోందని నిఘా వర్గాలు అంచనా వేశాయి. పాలిసెట్ క్యాంపు కార్యాలయం ఉండే సాంకేతిక విద్యా విభాగానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు అవసరమని ప్రభుత్వానికి నివేదించాయి. దీంతో సమీప పోలీసుస్టేషన్లతో పాటు, స్పెషల్ బ్రాంచీతో సమన్వయం చేసుకోవాలని అధికారిక ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది.

**క్యాంపు అధికారులు ఏం చెబుతున్నారు?**

పాలిసెట్ ఫీజుల వ్యవహారమే సీట్ల కేటాయింపు ఆలస్యానికి కారణమని అధికారులు అంటున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల ఫీజులు పెరిగాయి. రూ.15 వేల నుంచి రూ.39 వేల వరకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వ కాలేజీల్లో రూ.3,800 మాత్రమే ఫీజు వచ్చింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.15 వేలు ఇస్తుంది. కానీ, మిగిలిన రూ.24 వేలు విద్యార్థులు చెల్లించాలా? ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందా? అనే విషయంలో స్పష్టత రాలేదని చెబుతున్నారు. దీనికోసమే సీట్ల కేటాయింపు ప్రక్రియ ఆలస్యమవుతోందని అంటున్నారు. ఇదే నిజమైతే ప్రభుత్వ పెద్దలకు ఈ విషయం తెలియదా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి
సోమవారం, 7, జూలై, 2025

# ఇంజనీరింగ్ ‘అడ్మిషన్ల’ కోసం గాలం..!

హలో సార్ గుడ్ మార్నింగ్... మీరు అక్షయ్ పేరెంటేనా? అక్షయ్‌కు ఎంత ర్యాంకు వచ్చింది?ఏ కోర్సు కోసం ప్లాన్ చేశారు. కన్వీనర్ కోటాలో ఆ కోర్సు సీటు కష్టమే కదా..? బీ కేటగిరి మేనేజ్‌మెంట్ కోటా కింద వెళ్లకండి. డబ్బులు వృథా చేయవద్దు. మా కాలేజీలో తక్కువ ఫీజులో అదే కోర్సు పూర్తి చేయవచ్చు. ఒకసారి మా కాలేజీ క్యాంపస్‌ను విజిట్ చేయండి. ఆలస్యం చేయకండి. ఎప్పుడు వస్తారు? రేపు బాబుతో కలిసి వస్తారా? వచ్చేటప్పుడు నా నెంబర్‌కు కాల్ చేయండి సార్.



సార్, నమస్తే... మాది ఫలనా ఎడ్యుకేషన్ అకాడమీ. మీరు విజయ్ ఫాదరేనా? బీటెక్‌లో ఏ కోర్సు ప్లాన్ చేశారు. గుజరాత్ టాప్ వన్ ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. విశాలమైన స్థలం. హాస్టల్ వసతి, తక్కువ ఫీజు, స్కాలర్ షిప్, కోర్సు పూర్తయి తర్వాత మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ గ్యారంటీ. ఇప్పటికే 30 మందికి అడ్మిషన్లు ఇప్పించాం. కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఆలస్యం చేయకండి. ఆలోచించి సంప్రదించండి.

సాక్షి,సిటీబ్యూరో: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కూడా పూర్తి కావస్తోంది.ఏ ర్యాంక్ వరకు ఏ కాలేజీలో సీటు వస్తోందన్న ఉహాగానాలు ఉపందుకున్నాయి. గత విద్యా సంవత్సరం వచ్చిన ర్యాంకులను బట్టి అంచనా వేస్తున్నారు. టాప్ 10 నుంచి 20 కాలేజీల్లో సీటు ఆశలు సన్నగిల్లుతున్నాయి. వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, కన్సల్టెన్సీలు నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ల తాకిడి పెరిగింది. మరోవైపు డీమ్డ్ వర్సిటీల నుంచి వాట్సాప్, ఎస్ఎంఎస్ మేసేజ్‌లు విపరీంగా పెరిగిపోతున్నాయి. రోజు వారీగా కనీసం 20 నుంచి 30 నుంచి ఫోన్లు వస్తుండటంతో ర్యాంకులు ఎక్కువ వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. స్థానిక కాలేజీలో తమ పిల్లలకు వచ్చిన ర్యాంకుల బట్టి సీటు వస్తుందా? వారి భవిష్యతేంటని ఆందోళన చెందుతున్నారు.

### సీఎస్ఈ కోర్సుకు డిమాండ్

మహానగర పరిధిలోని టాప్ 20 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ‘ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సుకు డిమాండ్ బాగా పెరిగింది. సీటు కోసం ఎంత ఫీజు అయినా చెల్లించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సీట్లు లేకపోవడంతో, మేనేజ్‌మెంట్‌లు సొమ్ము చేసుకుంటున్నాయి. అయితే మేనేజ్‌మెంట్ కోటాలో సైతం కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సుల సీట్లకే పోటీ విపరీతంగా కనిపిస్తోంది. వాస్తవంగా మొత్తం సీట్లలో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేసుకునే అవకాశం ఉంది. ర్యాంక్ ఆధారంగా కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద సీట్లను నింపి మిగితా సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లోని సీట్లు టాప్ కాలేజీలలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు, సెంకడరీ కాలేజీల్లోనూ రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా తీసుకుంటున్నారు.

### ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఫోన్ల తాకిడి

- ఒక వైపు కన్సల్టెన్సీలు, మరోవైపు ప్రైవేట్ డీమ్డ్ వర్సిటీలు
- తక్కువ ఫీజుతో సీటు,హాస్టల్ వసతి అంటూ ఎర
- విద్యార్థుల తల్లిదండ్రుల అయోమయం

### డీమ్డ్‌వర్సిటీల తాకిడి..

ప్రై వేటు డీమ్డ్ వర్సిటీలు ఇంజనీరింగ్( బీటెక్) కోర్సులో అడ్మిషన్ల కోసం పోటీపడుతున్నాయి. తమ పీఆర్‌ఓలు, కన్సల్టింగ్ ఏజెన్సీల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఫోన్ల, వాట్సాప్, సందేశాల తాకిడి పెరిగింది.ఇప్పటికే వర్సిటీలు ప్రవేశాల కోసం అడ్మిషన్ ప్రకటనలు విడుదల చేసి కోర్సులు, ఫీజులు, ప్లేస్‌మెంట్ అవకాశాలు వంటి వివరాలతో పాటు వర్సిటీ ప్రాంగణం, సౌకర్యాలు, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ఫీజు, హాస్టల్ వసతి అంటూ గాలం వేస్తున్నాయి.

### అందరికీ సీట్ వస్తుంది..

రాష్ట్రంలో ఇంజనీరింగ్ బోలెడన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి పేర్కొంటోంది. సీట్ల కోసం డొనేషన్ కట్టి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రైవేటు కాలేజీల్లో బీ–క్యాటగిరీ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇంకా అనుమతించలేదని, నిబంధనలకు వ్యతిరేకంగా ముందే భర్తీ చేస్తే చర్యలు తప్పవని కాలేజీల యాజమాన్యాలను హెచ్చరిస్తోంది. అనుమతి లేని కాలేజీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తోంది. హైదరాబాద్ నానక్‌రాంగూడ , మాదాపూర్,హైటెక్ తదితర ప్రాంతాల్లోని పలు ఇంజినీరంగ్ సంస్థలకు ఏఐసీటీఈ గుర్తింపు లేదని స్పష్టం చేసింది.

# ఎట్టకేలకు ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు మోక్షం

- సీట్లు, కాలేజీలు, బ్రాంచీల వివరాలు విడుదల
- కన్వీనర్ కోటా సీట్లు 76,795
- కొత్త సీట్లకు అనుమతించని ప్రభుత్వం
- కౌన్సెలింగ్ పరిధిలోకి 171 కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వడానికి వీలుగా కాలేజీలు, సీట్లు, బ్రాంచీల వివరాలను ఎప్‌సెట్ క్యాంప్ ఆఫీసు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. వాస్తవానికి ఈ ప్రక్రియ ఆదివారం ఉదయం నుంచే ప్రారంభం కావాలి. కానీ రాత్రి 7 గంటలకు అప్‌లోడ్‌చేసే ప్రక్రియ పూర్తయింది. దీంతో సోమవారం నుంచి వెబ్ ఆప్షన్ల నమోదుకు విద్యార్థులు మొగ్గు చూసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 171 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. మొత్తం 1,07,218 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 70 శాతం.. అంటే 76,795 సీట్లు కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. మిగతావి యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. దాదాపు 68 శాతం వరకూ కంప్యూటర్, దాని అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయి. కోర్ గ్రూప్‌లో గత ఏడాది కొన్ని కాలేజీలు సీట్లు తగ్గించుకున్నాయి. ఇవి 7 వేల వరకూ ఉంటాయి. వీటి స్థానంలో కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లు పెంచమని కోరాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి లభించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సీట్ల పెంపునకు అనుమతించలేదు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో రెండు కాలేజీలు డీమ్డ్ హోదా పొందితే, ఒక కాలేజీ మూసివేతకు వెళ్లింది. అయితే, పాలమూరు, శాతవాహన, కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ పరిధిలో మూడు కొత్త కాలేజీలు పెరిగాయి.

- యూనివర్సిటీల అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీలు.. యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేటు వర్సిటీల్లో సీట్ల వివరాలు.. (రెండు ప్రైవేటు వర్సిటీల్లో 1,800 సీట్లు ఉంటాయి. ఇందులో 1,260 సీట్లు కన్వీనర్ కోటా కిందకు వస్తాయి).

| యూనివర్సిటీ | కాలేజీలు | మొత్తం సీట్లు | కన్వీనర్ కోటా |
|---|---|---|---|
| ఉస్మానియా | 14 | 10,230 | 7,161 |
| జేఎన్‌టీయూహెచ్ | 130 | 87,804 | 61,463 |
| కాకతీయ | 4 | 1,576 | 1,103 |
| ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు | 23 | 7,608 | 7,608 |
| మొత్తం | 171 | 1,072,18 | 76,795 |

### ప్రధాన బ్రాంచీల్లో సీట్లు..

| బ్రాంచీ | సీట్లు |
|---|---|
| ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్ | 1,235 |
| ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ | 858 |
| సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ) | 1,439 |
| సీఎస్ఈ (డేటాసైన్స్) | 6,996 |
| కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) | 26,150 |
| ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ | 12,495 |
| ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) | 10,125 |
| ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) | 4,301 |
| ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) | 3,681 |
| మెకానికల్ ఇంజనీరింగ్ | 2,994 |
| సివిల్ ఇంజనీరింగ్ | 3,129 |

ఈనాడు సోమవారం జులై 7, 2025

# పాలిటెక్నిక్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పీటముడి

- ఇది తేలేవరకు తొలివిడత సీట్ల కేటాయింపు పెండింగ్

ఈనాడు, హైదరాబాద్: పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపు ఆలస్యం కావడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యే కారణమని తేలింది. ఇప్పటివరకు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల ఫీజు రూ.14,900 ఉండేది. ఆయా కళాశాలల విన్నపం మేరకు..రూ.39 వేల వరకు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గత విద్యా సంవత్సరం(2024-25) ప్రవేశాలు ముగిసిన తర్వాత ఫీజును గరిష్ఠంగా రూ.39 వేలుగా నిర్ణయిస్తూ విద్యాశాఖ జీఓ జారీ చేసింది. మొత్తం 55 ప్రైవేట్ కళాశాలల్లో 43 కళాశాలలకు ఆ ఫీజు ఉండగా...మిగిలిన వాటికి రూ.14,900 నుంచి రూ.35 వేల వరకు నిర్ణయించారు. ఇప్పటివరకు విద్యార్థులకు గరిష్ఠంగా రూ.14,900లను ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇప్పుడు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు రూ.39 వేల వరకు ఉండగా...ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచకుంటే విద్యార్థులపై భారం పడుతుంది. దీనిపై సంక్షేమ శాఖ అధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే మొత్తాన్ని పెంచాలని కొన్ని నెలల క్రితమే ప్రతిపాదించినా.. ప్రభుత్వం ఈ అంశంపై ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. పాలిసెట్ తొలి విడత సీట్లు కేటాయిస్తే...సీట్ అలాట్‌మెంట్ ఆర్డర్‌లో ఎంత మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తారు? సొంతంగా ఎంత ఫీజు చెల్లించాలో పొందుపరచాలి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ఎటూ తేల్చకపోవడంతో తొలి విడత సీట్ల కేటాయింపు పెండింగ్‌లో పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 4వ తేదీలోపు పాలిసెట్ సీట్లు కేటాయించాల్సి ఉంది. దీనికోసం దాదాపు 20 వేల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

# 171 కళాశాలలు.. 1.14 లక్షల సీట్లు

- కన్వీనర్ కోటాలో భర్తీ చేసేవి 76,795
- ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 6,500 వరకు అదనం
- ఎప్‌సెట్ వెబ్ ఆప్షన్లు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి 171 ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో.. 1.14 లక్షలకుపైగా బీటెక్ సీట్లున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ లెక్కలు తేల్చింది. ఎప్‌సెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రారంభమైంది. గత ఏడాది మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు 172 ఉండగా.. వాటిలో కన్వీనర్, బి కేటగిరీ సీట్లు 1,18,989 ఉన్నాయి. ఈసారి కొత్తగా పాలమూరు, శాతవాహన వర్సిటీల పరిధిలో రెండు ప్రభుత్వ కళాశాలలు పెరిగాయి. ఐదు ప్రైవేట్ కళాశాలలు తగ్గాయి. వాటిలో రెండు కళాశాలలు డీమ్డ్ వర్సిటీలుగా మారగా.. ఒకటి ప్రైవేట్ వర్సిటీలో కలిసింది. ...మిగతా 2లో

## 171 కళాశాలలు.. 1.14 లక్షల సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

మరో రెండు అసలు దరఖాస్తు చేసుకోలేదు. రెండో విడత నాటికి కళాశాలల సంఖ్య మారకపోవచ్చుగానీ. . సీట్లు పెరిగే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. కన్వీనర్ కోటా కింద కౌన్సెలింగ్ ద్వారా 76,795 సీట్లను భర్తీ చేస్తారు. వాటికి అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటా కింద దాదాపు మరో 6,500 సీట్లు కలుస్తాయని అధికారులు తెలిపారు.

### ఇవీ లెక్కలు..

| కళాశాలలు.. | సంఖ్య | సీట్లు (ఈబ్ల్యూఎస్ కోటా కాకుండా) |
| --- | --- | --- |
| ప్రభుత్వ | 21 | 5,808 |
| ప్రైవేట్ | 148 | 99,610 |
| ప్రైవేట్ వర్సిటీలు | 2 | 1,800 |
| మొత్తం | 171 | 1,07,218 |

### ముఖ్యమైన బ్రాంచీల్లో సీట్లు(కన్వీనర్ కోటా)

| బ్రాంచీ | సీట్లు |
| --- | --- |
| సీఎస్ఈ | 26,150 |
| సీఎస్ఈ(ఏఐ-ఎంఎల్) | 12,495 |
| సీఎస్ఈ(డేటా సైన్స్) | 6,996 |
| ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ | 3,681 |
| సీఎస్ఈ(సైబర్ టెక్నాలజీ) | 1,439 |
| ఏఐ అండ్ ఎంఎల్ | 1,235 |
| ఈసీఈ | 10,125 |
| ఈఈఈ | 4,301 |
| సివిల్ | 3,129 |
| మెకానికల్ | 2,994 |

సోమవారం | హైదరాబాద్
07.07.2025
www.v6velugu.com
ప్రభాత వెలుగు

# 171 కాలేజీలు.. లక్షకు పైగా బీటెక్ సీట్లు



## ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ షురూ

- కన్వీనర్ కోటాలో 76,795 సీట్లు
- 21 సర్కార్ కాలేజీల్లో 5,808 సీట్లు
- డీమ్డ్ వర్సిటీలుగా మారిన రెండు ప్రైవేటు కాలేజీలు
- అడ్మిషన్లకు ముందుకు రాని మూడు ప్రైవేట్ కాలేజీలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. దీంతో ఆయా కాలేజీల్లో సీట్లపై క్లారిటీ కూడా వచ్చింది. సీట్ల వివరాలను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటించారు.

మిగతా 5లో



# ..లక్షకు పైగా బీటెక్ సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 171 కాలేజీల్లో 1,07,218 బీటెక్ సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఇందులో కన్వీనర్ కోటాలో 76,795 సీట్లు ఉన్నాయి. వీటిలో 21 సర్కారు కాలేజీల్లో 5,808 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా పాలమూరు, శాతవాహన వర్సిటీల పరిధిలో ఒక్కో కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 148 ప్రైవేటు కాలేజీల్లో 99,610 సీట్లు ఉండగా.. వాటిలో 69,727 సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో 1800 సీట్లు ఉండగా, ఇందులో కన్వీనర్ కోటాలో 1,260 సీట్లను భర్తీ చేయనున్నారు. కాగా, రాష్ట్రంలో రెండు ప్రైవేటు కాలేజీలకు డీమ్డ్ వర్సిటీగా మారిపోయాయి. ఎంఎన్ఆర్, వివేకానంద, సెయింట్ మేరీ ప్రైవేటు కాలేజీలు అడ్మిషన్ల కోసం ముందుకు రాలేవు.

**సర్కార్ కాలేజీల్లో..!**

ఓయూ పరిధిలోని రెండు సర్కారు కాలేజీల్లో 630, జేఎన్టీయూహెచ్ పరిధిలోని 9 సర్కార్ కాలేజీల్లో 3,210 సీట్లు, కాకతీయ వర్సిటీ పరిధిలోని రెండు సర్కార్ కాలేజీల్లో 780 సీట్లు ఉన్నాయి. మహాత్మా గాంధీ వర్సిటీ పరిధిలోని ఒక సర్కార్ కాలేజీలో 240 సీట్లు, ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ పరిధిలోని ఒక సర్కార్ కాలేజీలో 160 సీట్లు, అగ్రికల్చర్ వర్సిటీ పరిధిలోని ఒక సర్కార్ కాలేజీలో 45 సీట్లు, వెటర్నరీ వర్సిటీ పరిధిలోని ఒక సర్కార్ కాలేజీలో 23 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**సీఎస్ఈలో 26,150 సీట్లు..**

బీటెక్ ఫస్టియర్‌లో మొత్తం 47 బ్రాంచుల్లో సీట్లు భర్తీ చేస్తున్నారు. దీంట్లో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) లో 26,150 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలో సీఎస్ఈ (ఏఐఎంఎల్) లో 12,495 సీట్లుండగా.. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ)లో 10,125 .. సీఎస్ఈ డేటా సైన్స్ లో 6,996.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ)లో 4,301.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)లో 3,681.. సివిల్ ఇంజనీరింగ్ లో 3,129.. మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2,994 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీలో 1,439.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ లో 1,235 సీట్లు ఉన్నాయి.

### ఫస్ట్ ఫేజ్‌లో 10 వరకు వెబ్ ఆప్షన్లు

టీజీ ఎప్ సెట్–2025 ఫస్ట్ ఫేజ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. సాయంత్రం నాటికి మొత్తం 95,654 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోగా.. 7,6494 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు అవకాశం ఉండగా.. వెబ్ ఆప్షన్లకు 10 వరకు చాన్స్ ఉంది.

**ప్రైవేటు కాలేజీల్లో సీట్ల వివరాలు**

| వర్సిటీ | కాలేజీలు | మొత్తం సీట్లు | కన్వీనర్ కోటా |
|---|---|---|---|
| ఓయూ | 14 | 10,230 | 7,161 |
| జేఎన్టీయూ | 130 | 87,804 | 61,463 |
| కేయూ | 04 | 1,576 | 1,103 |
| మొత్తం | 148 | 99,610 | 69,727 |

# పాలిటెక్నిక్ ఫీజులపై గందరగోళం

- నిలిచిన పాలిసెట్ సీట్ల కేటాయింపు
- రెండు, మూడు రోజుల్లో క్లారిటీ
- గత నెల 24 నుంచి మొదలైన అడ్మిషన్ల ప్రక్రియ
- వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన 24వేల మంది
- త్వరలో సీట్ల అలాట్‌మెంట్ చేస్తామని ఎస్‌బీటెట్ ప్రకటన




హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఫీజులపై స్పష్టత కరువైంది. దీంతో పాలిసెట్ సీట్ల అలాట్‌మెంట్ ప్రక్రియ నిలిచిపోయింది. విద్యార్థుల్లో అయోమయం నెలకొనగా.. త్వరలోనే సీట్ల అలాట్‌మెంట్ చేస్తామని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటెట్) ప్రకటించింది. మే13న పాలిసెట్ ఎగ్జామ్ నిర్వహించగా, 98,858 మంది అటెండ్ అయ్యారు. గతనెల 24 నుంచి పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 24 వేల మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4న సీట్ల అలాట్‌మెంట్ చేయాలి. కానీ, ఫీజులపై స్పష్టత రాకపోవడంతో ఈ ప్రక్రియ నిలిపివేశారు.

**ఫీజులపై స్పష్టత లేకపోవడంతోనే..**

రాష్ట్రంలో 59 గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలుండగా.. ఇందులో 12,882 సీట్లున్నాయి. 55 ప్రైవేట్ కాలేజీల్లో 30,890 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం గవర్నమెంట్ కాలేజీల్లో రూ.3,800, ప్రైవేట్ కాలేజీల్లో రూ.15వేల ఫీజు ఉన్నది. ఈ ఫీజులను 2010లో నిర్ణయించారు. దీనిపై మేనేజ్‌మెంట్స్ ఆందోళన నేపథ్యంలో టీఏఎఫ్ఆర్సీ ద్వారా ఫీజులను లెక్కించారు. మొత్తం రూ. 39 వేల వరకు ఉండాలని సర్కారుకు నిరుడు ప్రతిపాదనలు పంపించారు. అయితే, ఏ కేటగిరీ వారికి ఎంతెంత అనేదానిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో విద్యా, ఆర్థిక శాఖల నుంచి అధికారులు వివరాలు కోరారు. ఆయా శాఖల నుంచి స్పష్టత రాకపోవడంతో పాలిసెట్ సీట్ అలాట్‌మెంట్‌ను నిలిపేశారు. దాదాపు అన్ని కాలేజీల్లోనూ రూ.37 వేలు, రూ. 39 వేలుగా ఫీజు ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. అయితే, ప్రైవేట్ కాలేజీల్లోనూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగానే విద్యనందించాలి. మిగిలిన బీసీ, ఓసీ విద్యార్థులు, సర్కారు బడుల్లో చదివిన విద్యార్థులకు ఏమైనా రాయితీ ఉంటుందా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇంజినీరింగ్ ఫీజుల మాదిరిగానే.. పాలిసెట్‌లోనూ కొన్ని ర్యాంకుల వరకు పూర్తిగా, మిగిలిన ర్యాంకుల వారికి కొంత ప్రభుత్వం, కొంత విద్యార్థులు కట్టుకునేలా ఫీజులు నిర్ణయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. కాగా, రెండు, మూడు రోజుల్లోనే దీనిపై క్లారిటీ రానున్నదని, ఆ తర్వాతే సీట్ల అలాట్‌మెంట్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.